క్లుప్తంగా

ఆవులకు 'లంపీ స్కిన్' నివారణ టీకాలు



నందిగాంలో ఆవులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు వేస్తున్న సచివాలయ ఏహెచ్ఏ నాగమణి

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఆవులకు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. శనివారం మండలంలోని నందిగాం గ్రామంలో జరిగిన వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన మండల పశువైద్యాధికారి ఆవులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా టీకాలు వేస్తున్నామన్నారు. రైతులంతా తమ వద్ద ఉన్న మూగజీవాలకు ఈ టీకాలు వేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి, రామభద్రపురం-3 సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న పలు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రమామణి ఓ ప్రకటనలో శనివారం ప్రకటించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 9వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 10వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని, నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని, దేశ నాయకుల జీవిత చరిత్ర, స్వాతంత్ర్య సముపార్జనకు వారు చేసిన కృషిపై విద్యార్థులతో మాట్లాడించినట్లు లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం హైస్కూల్ ఉపాధ్యాయుడు జి.తిరుపతిరావు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామన్నారు.

వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలి

రాజాం సిటీ: అంకితభావంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు వలంటీర్లకు సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నియమితులైన వార్డు వలంటీర్లకు విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులకు చేరవేయాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చాటాయవలసలో 'పొలంబడి'

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం వరినాట్లు వేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరినారు వేసే ముందు వరినారు కొనలు తొలగించాలని, ఇలా చేయడం ద్వారా పంటకు చీడపీడలు సోకకుండా ఉంటాయన్నారు. అలాగే పంట ఏపుగా పెరుగుతుందన్నారు. అలాగే పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తవిటినాయుడు, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం



ఎమ్మెల్సీ సురేష్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో అభివృద్ధి అంటే ఏమిటి? అనే అంశంపై శనివారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఎమ్మెల్యే పాల్గొని, కాసేపు మాట్లాడారు. గతంలో టీడీపీ తన ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే అజెండాగా పాలన కొనసాగిస్తోందన్నారు. ఓ వైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు ప్రతీ గ్రామంలోని సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పించి, వారు బాగుంటే అదే కదా అభివృద్ధి అన్నారు. వచ్చే ఐదేళ్లు కూడా ఇదే ప్రభుత్వానికి మళ్లీ అధికారం అప్పగిస్తే రాష్ట్రం మరింత బాగుంటుందన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పెనమత్స సురేష్‌బాబును ఎమ్మెల్యే తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బి.కాశినాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు, బుడా చైర్‌పర్సన్ ఐ.పార్వతి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు సీహెచ్ మురళి, రమాదేవి, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు టి.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎస్.వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణ పరిధిలోని కొత్తవలస గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు అందేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హతే ఉంటే చాలని సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరుగుతోందన్నారు. టీడీపీ తన పాలనలో ప్రజాధనం దోచుకుందని విమర్శించారు. పవన్ కల్యాణ్ ప్యాకేజీకి ఆశపడి, టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని, పాపం ఆయన తీరు చూసి, ఆయన ఫ్యాన్స్ అయోమయంలో పడిపోయారన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ వి.విజయ్‌కుమార్, వై.వెంకటేష్, వి.లక్ష్మణరావు, కె.సత్యం, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రూ. 1.36 కోట్లతో అభివృద్ధి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గంలోని 68 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం రూ.1.36 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. స్థానిక రెల్లివీధిలో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో బోరు, తాగునీటి ట్యాంక్, సీసీ రోడ్డు నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఆయన చేస్తున్న పాలనతో వైఎస్సార్ సీపీ పట్ల ప్రజల్లో మరింత ఆదరణ పెరిగిందన్నారు. జనమంతా సీఎం జగన్ సుపరిపాలనకే జై కొడుతున్నారన్నారు. మరోసారి అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమవుతున్న టీడీపీకి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు కేరాఫ్ సీఎం జగన్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని అప్పలంపేట పంచాయతీలో సర్పంచ్ గురవాన పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా సంక్షేమ పాలన కొనసాగుతోందని, ఎటువంటి సిఫార్సులు లేకుండా, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తెర్లాం, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎస్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



రాజాం: వీఆర్ అగ్రహారంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు



బొబ్బిలి: హౌసింగ్ డే కార్యక్రమంలో లబ్ధిదారులతో అధికారులు

రాజాం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. హౌసింగ్ డేలో భాగంగా మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన అక్కడి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలు చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు, సామగ్రి ఇవ్వడం జరుగుతోందని, నిర్మాణాలు ఇంకా చేయని వారు ఎవరైనా వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. అలాగే నిర్మాణాలు చేపట్టిన వారు వాటిని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.ఆదిలక్ష్మి, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, వీఆర్‌ఓ జి.అనంతరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో హౌసింగ్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య, ఎంపీడీఓ పోతుల రవికుమార్ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని, సకాలంలో బిల్లులు, సామగ్రి ఇవ్వడం జరుగుతుందన్నారు.

తలగాంలో గజరాజులు



పంట పొలాల్లో తిరుగుతున్న ఏనుగుల గుంపు

వంగర: మండలంలోని తలగాం పంట పొలాల్లో గజరాజుల గుంపు తిష్ట వేసింది. శుక్రవారం అర్ధ రాత్రి వరకు శివ్వాం గ్రామంలో సంచరించిన గజరాజులు శనివారం తెల్లవారుజామున తలగాం వైపు పయనమై పంటపొలాల్లో ఉన్నాయి. అటవీ శాఖ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రేకర్స్ వాటి వెంట ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేసిన పౌష్టికాహార కిట్లు అందజేసి, తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, తల్లిపాలలో అనేక పోషక విలువలు ఉంటాయని, అప్పుడే పుట్టిన బిడ్డకు కొన్నాళ్ల పాటు తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరన్నారు. లబ్ధిదారులంతా ఈ పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉంటూ, పిల్లలను కూడా ఆరోగ్యంగా ఉంచాలని కోరారు.

-బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



వంగర: నీలయ్యవలసలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ వంగర సెక్టార్ సూపర్‌వైజర్ రజని



రేగిడి: లచ్చారాయపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ



రాజాం సిటీ: రాజాంలోని మల్లిఖార్జునకాలనీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ రాజాం సెక్టార్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ



సంతకవిటి: బొద్దూరులో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు



తెర్లాం: జనార్దనవలసలో తల్లిపాల వారోత్సవాలు



బొబ్బిలి: పాతబొబ్బిలిలో గర్భిణులకు సీమంతం కానుకలు అందజేస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, కౌన్సిలర్ రమేష్‌నాయుడు

సంక్షిప్తంగా...

న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని రాజా కాలేజీలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ టి.వాసుదేవన్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి ఎం.సరోజినమ్మ హాజరై, భారత న్యాయవ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసన్నకుమార్, ప్రేమలత, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఫైర్‌స్టేషన్ వద్ద శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ వి.బి.రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో పెండింగ్ చలానాల వసూళ్లతో పాటు ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎ.లక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

జీతాలు తక్షణమే చెల్లించాలి

రాజాం సిటీ: ఇటీవల బదిలీ అయిన, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ సంఘ సభ్యులు కోరారు. శనివారం ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లా తిరుపతిరావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, వి.రామకృష్ణంనాయుడు, ఎస్.రమణ, కె.చంద్రినాయుడు, జి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ

రాజాం సిటీ: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం రాజాంలోని అమ్మవారి ఆలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సైకిల్ యాత్ర చేపట్టామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఎంను పునఃప్రారంభించాలని, ఎటువంటి నిబంధనలు లేకుండా స్కాలర్‌షిప్‌లు అందజేయాలని కోరారు. ఎస్ఈపీ ద్వారా మూతపడిన పాఠశాలలు తెరవాలని, జీఓ నెంబర్ 77ను రద్దుచేసి, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, జిల్లా సభ్యులు ఎం.హర్ష, జె.రవి, వాసు, శివ, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఆసిరినాయుడు సూచించారు. శనివారం మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో ఎక్కువగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, చిన్నపాటి అస్వస్థతకు గురైనా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుపై రైతుల ఆసక్తి



ఉప్పర్నాయుడువలసలో ఈ-క్రాప్ నమోదు కోసం రైతు ఫొటో తీస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని రైతులంతా ఈ-క్రాప్ నమోదుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్‌బీకేల వద్దకు చేరుకుని, వీఏఏలు, వీఆర్‌ఓల ద్వారా తాము పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటున్నారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును అధికారులు శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

వంగర: గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు సూచించారు. శనివారం మండలంలోని మగ్గూరు రైతు భరోసా కేంద్రంలో అన్ని రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన పంటల సేద్యంలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో సూచనలు చేశారు. ప్రతీ పంటకు ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న 803 మంది రైతుల బయోమెట్రిక్ పూర్తి చేసి, ఆ వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

రామభద్రపురం: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పలువురు చిన్నారులకు శనివారం టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఉచితంగా టీకాలు వేయిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాణాంతక వ్యాధుల నుంచి పసిపిల్లలను రక్షించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

బొబ్బిలి: పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమైన ఆయన ఓ కుటుంబ ఓటర్లంతా ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతీ ఓటరు ఇంటి నంబర్‌ను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

రేగిడి: ఎంఈఓ-1 ఎం.వి.ప్రసాదరావును డిప్యూటీ డీఈఓ బ్రహ్మజీరావు శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంఈఓ గాయాలపాలై, రాజాంలోని తన నివాసంలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఈఓ ఆయనను కలిసి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దుప్పట్ల వితరణ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో పలువురు అనాథ వృద్ధులకు దాతలు వితరణ చేసిన దుప్పట్లను అదే గ్రామానికి చెందిన పాలూరి సిద్ధార్థ శనివారం అందజేశారు. తాను ఐదేళ్లుగా చేపడుతున్న నిత్యాన్నదానానికి హాజరవుతున్న వారికి దాతలు వీటిని అందించారని, వారిని తన కృతజ్ఞతలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత ఏఓ వెంకటయ్య తమ శాఖకు సంబంధించిన నివేదికను చదివి వినిపించారు. ఈ క్రమంలో బూసాయవలసకు ఇప్పటివరకు ఎరువులు రాలేదని ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు ప్రశ్నించగా, వీలైనంత త్వరగా వచ్చేలా చూస్తామని సదరు అధికారి సమాధానమిచ్చారు. హౌసింగ్ ఏఈఈ సింహాచలంనాయుడు ఆ శాఖకు సంబంధించి, నివేదికలు చదువుతూ కాలనీల్లో నిర్మించిన ఇళ్ల వద్ద ఇంకుడుగుంత ఏర్పాటుకు ఒక్కో దానికి రూ.6 వేల చొప్పున, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలను ప్రభుత్వం ఇస్తుందని, వాటిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ శశిభూషణరావు తమ నివేదికలు చదువుతూ జగనన్న లేఅవుట్‌లో ఇంటింటికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ రాజారావు రెవెన్యూ శాఖకు సంబంధించి, నివేదికలు వివరిస్తూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సక్రమంగా జరుగుతోందన్నారు. రామభద్రపురంలోని రామమందిరం వద్ద బస్‌స్టాప్ నిర్మించాలని ఎంపీటీసీ-2 వసంతుల తిరుపతిరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తప్పనిసరిగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే కనిమెరకలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ఎంపీటీసీ బవిరెడ్డి చంద్రశేఖర్ ఎమ్మెల్యేను అడగ్గా, మరుగుదొడ్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు ఏ విధమైన ఇబ్బందులు పడకూడదన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆయన లక్ష్య సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.సరస్వతి, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు, వైస్ ఎంపీపీలు బి.ప్రసాదరావు, పి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై, కాసేపు ప్రసంగించారు. భూముల రీసర్వే, ఓటర్ల జాబితా తయారీని పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తహసీల్దార్ ఎ.రఫీజాన్ మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామాలకు 21 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందని, ఓటర్ల జాబితా ప్రక్రియ కూడా పక్కాగా జరుగుతోందన్నారు. ఈ క్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్.భాస్కరరావు స్థానిక ఎన్నికల్లో మూడో వార్డులో తన పేరు ఉందని, ఇప్పుడు చివరి వార్డులో ఉందని తెలపగా, దీనిపై ఎమ్మెల్యే కలుగజేసుకుని, ఓ కుటుంబ ఓటర్లంతా ఓ పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఉండేలా ఓటర్ల జాబితా రూపొందించడం ద్వారానే ఇలా మీ పేరు ఆ వార్డులో ఉందని వివరించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల పంపిణీలో జాప్యం చేస్తున్నారని మండల వైస్ ఎంపీపీ బి.రమేష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓ లక్ష్మణదొర మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలవుతోందన్నారు. నాడు-నేడు పనులను కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ మండలంలోని 17 ఆర్‌బీకేల ద్వారా 144 క్వింటాళ్ల వరి, పచ్చిరొట్ట విత్తనాలను, మరో 443 టన్నుల యూరియా, 251 టన్నుల డీఏపీ ఎరువులు తెప్పించామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పి.రామారావు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.